www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 6 అక్టోబర్ 2023

5

అన్నమయ్య



అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : ఎస్‌పి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రాజంపేట డిఎస్‌పి చైతన్య, సిఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐలు సుభాష్ చంద్రబోస్, డాక్టర్ నాయక్, వెంకటేశ్వర్లుతో నేరాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులు స్థానిక ట్రాఫిక్ సమస్యలు, పట్టణంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ఎస్‌పి దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి ట్రాఫిక్ సమస్యను అదుపు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. గంజాయి, అక్రమ మద్యం, మట్కా లాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాటిని అదుపు చేసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి గానీ, స్థానిక సిఐ దృష్టికి గానీ తీసుకురావచ్చని పేర్కొన్నారు. అనంతరం మహిళా పోలీసులతో ఆయన సమీక్ష నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

దారుణం

- భార్యా పిల్లలను తుపాకీతో కాల్చి ఆపై హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- సంఘటన స్థలంలో సూసైడ్ నోట్
- సర్వహక్కులు రెండవ భార్యకు కల్పించాలని ఎస్‌పికి లెటర్
- విచారణ చేపట్టిన పోలీసులు



హెడ్ కానిస్టేబుల్ భార్యా, పిల్లలు (ఫైల్‌ఫోటో)



మంచంపై పడి ఉన్న మృతదేహాలు



హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడపలో విషాదం చోటుచేసుకుంది. నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో నివాసం ఉంటూ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు(55) (హెచ్‌సి 1895) సర్వీస్ రివాల్వర్‌తో భార్య, ఇద్దరు కుమార్తెలను కాల్చి చంపిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తాను అదే రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలో భార్య మాధవీలత(50), కుమార్తెలు లిఖిన్య(21), అఖిల(16)ను నిద్రిస్తున్న సమయంలో రివాల్వర్‌తో కాల్చి చంపినట్లు సంఘటన స్థలంలో చోటుచేసుకున్న దృశ్యాలపు బట్టి తెలుస్తోంది. సంఘటన స్థలాన్ని డిఎస్‌పి షరీఫ్, సిఐలు, ఎస్‌ఐలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలం పరిశీలించిన అనంతరం డిఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండేళ్ల నుండి పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం రాత్రి 10.30 నుంచి 11 గంటల వరకు పోలీస్ స్టేషన్‌లో ఉన్నారని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో కస్టోడియన్, రైటర్‌గా పని చేస్తున్నారు. కస్టోడియన్ అధీనంలో సర్వీస్ పిస్టల్, ప్రాపర్టీస్ ఉంటాయని పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్‌ను బట్టి తెలుస్తుందన్నారు. రెండవ భార్య కుమారుడికి బెనిఫిట్ చెందాలని నోట్‌లోరాసి ఉందన్నారు. నోట్ బట్టి చూస్తే కుటుంబ కలహాలు, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తుందన్నారు. దర్యాప్తులో అన్నివిషయాలు బయటకు వస్తాయని చెప్పారు. ఆయన సొంత ఊరు పులివెందుల అన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.




ఆత్మహత్యకు ఉపయోగించిన సర్వీస్ తుపాకీ

ఆత్మహత్య కారణాలను వెలికితీస్తాం : ఎస్‌పి

హెడ్ కానిస్టేబుల్ భార్య, బిడ్డల్ని కాల్చి చంపి, తాను పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న కారణాలను పోలీస్ విచారణలో వెలికితీస్తామని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. రిమ్స్ మార్చురీలో ఉన్న మృతదేహాలను ఎస్‌పి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆత్మహత్యకు కారణం ఆర్థిక సమస్యా, ఇంకా ఏమైనా ఉన్నాయా అనే వాటిపై విచారణ ప్రారంభించామని పేర్కొన్నారు.

మృతదేహాలను సందర్శించిన డిప్యూటీ సిఎం, మేయర్

హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఆత్మహత్య చేసుకున్న విషయం తెసుకున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ వెంకటేశ్వర్లను బొట్టు స్వామి అని తాము పిలిచేవారని పేర్కొన్నారు. ఆత్మహత్య బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అతను చాలా మంచివాడన్నారు.



హెడ్‌కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి -రాయచోటి


ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని జగనన్న సురక్ష ఆరోగ్య క్యాంపు శిబిరాల వద్ద ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణ'పై వైద్యాధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందిని అధికారులు కూడా క్యాంపుల నిర్వహణ బాగా చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొంటున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటి వద్దకే ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ శిబిరాలలో స్పెషలిస్ట్ డాక్టర్లు మెడికల్ అధికారులు బాగా భాగస్వామ్యం అవుతున్నారు. ముఖ్యంగా ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభమైన వెంటనే ఒపిఎస్ ఎంట్రీని తప్పనిసరిగా చేయాలిని ఎంపిడిఒ మున్సిపల్ కమిషనర్ మెడికల్ అధికారుల లాగిన్‌లో సురక్ష క్యాంపు మొదలుపెట్టినట్లు ఉదయం 10 గంటల లోగా తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నమోదును సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పూర్తి చేయాలని ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మెడికల్ అధికారులు ఈ అంశాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీ కరించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటుకు రెండు రోజులు ముందు ఫ్రీ క్యాంప్ అవేర్నెస్ చేయాలని సదర్ వాలంటీర్ ద్వారా ఎస్‌ఎంఎస్ పంపాలి అన్నారు. విసిలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, డిసిహెచ్‌ఎస్ సుకుమార్, మెడికల్ అధికారి రియాజ్, జిఎస్‌డిడబ్ల్యుఎస్ మనోహరరాజు, సర్వే ఏడి జయరాజ్, సోషియల్ వెల్ఫేర్ అధికారి జాకీర్ హుస్సేన్, ఇరిగేషన్ అధికారి కృష్ణ మూర్తి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

విభజన హామీలను విస్మరించిన బిజెపి ప్రభుత్వం

- పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు



ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రానికి అన్ని విధాల మోడీ సర్కార్ మోసం చేస్తున్నదని ఎపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.రెడ్డి సాహెబ్ అధ్యక్షతన పట్టణంలోని బెంగళూరు బస్టాండ్ నుండి మిషన్ కాంపౌండ్ వరకు భారీ ర్యాలీగా వెళ్లారు. అనంతరం మిషన్ కాంపౌండ్ మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మయప్పన్, గిడుగు రుద్రరాజు, పిసిసి మీడియా ప్రతినిధి ఎన్.తులసి రెడ్డి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, కాంగ్రెస్ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ సాకే శంకర్, పిసిసి అధికార ప్రతినిధి పార్థ సారధిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రధానులు అందరూ ఆణిముత్యాలేనని కొనియాడారు. జవహర్ లాల్ నెహ్రూ నుండి మన్మోహన్ సింగ్ వరకు అందరూ దేశ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఇందిరాగాంధీ దేశ పురోభివృద్ధిలో తనదైన ముద్రవేశారన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడోయాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. కేంద్రంలోని అధికార బిజెపి ప్రభుత్వంతో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసరాలు ధరలు పెంచడంతోపాటు జీఎస్టీల రూపంలో సామాన్యులను దోచుకుంటున్నారని విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో బాలికను అత్యాచారం చేసి అత్యంత దారుణంగా చంపేశారని, మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడి, చర్చలను కాల్చి వేయడం భారతదేశానికి మాయని మచ్చ అన్నారు.కాంగ్రెస్ పార్టీకి నమ్మకం ద్రోహం చేసిన నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇతర పార్టీలకు వెళ్లారని,ఇది తల్లి పాలు తాగి రొమ్మును గుద్దడం అనే సామెతకు వంద సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యుఐ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ అమృత్ తేజ,షేక్ అల్లా బక్ష్, గోశాల దేవి, మన్సూర్ అలీ, మహమ్మద్ షరీఫ్, డాక్టర్ వర్ధన్ చౌదరి, అన్నమయ్య జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లు షేక్ అల్లా బక్ష్, ఎం.ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్ర యాదవ్, లీలా శ్రీనివాస్, సోమశేఖర రెడ్డి, పూల భాస్కర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సర్వీసులు అందించడం అభినందనీయం : గడికోట

ప్రజాశక్తి - రామాపురం

రాయచోటి నియోజక వర్గంలో నాలుగేళ్ల పాలనలో 8 వేల వ్యవసాయపు విద్యుత్ సర్వీసులు (ట్రాన్స్ ఫార్మర్లు) అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజక వర్గంలోని విద్యుత్ సమస్యలపై ఎపి ఎస్‌పిడిసిఎల్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డితో రామాపురం మండలం రాచపల్లెలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సమీక్షించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల కాలం నాటికి రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను రెండు వేల మాత్రమే ఇచ్చారన్నారు. రైతులకు, వినియోగ దారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గృహాలపై ప్రమాదకరంగా ఉన్న 33 కె వి ,11 కె వి విద్యుత్ స్తంభాలు, లైన్ల తొలగింపు పనులను, గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గాలివీడు మండలంలోని అరవీడు, చీమల చెరువుపల్లెలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వచ్చిన విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రాయచోటి పట్టణంలో గృహ వినియోగ దారులకు సబంధించి అదనంగా 50 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తుచేసుకున్న రైతులందరికీ వ్యవసాయపు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. రామాపురం మండలం రాచపల్లెలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట ఎఇ వరప్రసాద్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

సంక్షేమాభివృద్ధిలో సరికొత్త అడుగులు

ప్రజాశక్తి-రామాపురం

సంక్షేమాభివృద్ధిలో సిఎం జగన్ సరికొత్త అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాచపల్లె పంచాయతీలోని మంగలపల్లె, చౌటంకి దళితవాడ, చిన్న కొండావాండ్లపల్లె, కొలిమివాండ్లపల్లె, నడింపల్లె, రాచపల్లె, కొమ్మూరివాండ్లపల్లె, ఎగువ కొవ్వూరి వాండ్లపల్లె, దిగువ కొవ్వూరివాండ్లపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, బీదవాండ్లపల్లె, బీదంవాండ్లపల్లె దళిత వాడలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో జగన్ ఇచ్చిన హామీలను 90 శాతానికి పైగా అమలు చేయడంతో ప్రతి ఇంటా సంక్షేమ బావుటా ఎగురుతోందన్నారు. ప్రతి పల్లెలో ఇంటింటికీ రెండు, లేక మూడు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఇన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం జగన్ ప్రభుత్వమేనన్నారు అక్క చెల్లెమ్మలకు అండగా వైఎస్ఆర్ ఆసరా నిలిచిందంటూ ఎమ్మెల్యే ఎదుట డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు మహిళా సంఘాలను భారీ సమావేశాలకు తరలించుకున్నారే తప్ప వారికి లబ్ధిచేకూర్చిందిలేదన్నారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలును లక్షాధికారులుగా చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గడికోట జనార్ధనరెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకట రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథ రెడ్డి, సర్పంచ్ పలవలి వెంకట రెడ్డి, ఎంపిటిసి ద్వారకనాథ రెడ్డి,సింగల్ విండో అధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి,పెద్దిరెడ్డి, వైస్ ఎంపిపిలు రవిశంకర్ రెడ్డి, బాబు,వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచులు నాగభూషన్ రెడ్డి,శివయ్య, సుబ్బయ్య,ఆయూబ్ ఖాన్, ఆంజనేయులు, రామాంజులు, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి, ప్రకాష్ రెడ్డి,మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి,యోగాంజులు రెడ్డి,చలమారెడ్డి,నాగేంద్ర రెడ్డి, స్థానిక నాయకులు వెంకటేశ్వర రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, గణేష్ కుమార్ రెడ్డి, లోకేష్, హరి, నాగార్జున, ఖాదర్ వలీ,రామాంజులు, నాగబసిరెడ్డి, సత్తార్ ఖాన్, రాజేంద్ర, కరీంబాష, శ్రీను, సాయి పాల్గొన్నారు.

'మిట్స్' విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిట్స్ కళాశాలలో బిటెక్, ఎంబిఎ, ఎంసిఎ చదువుతున్న 30 మంది విద్యార్థులకు ఎస్.ఆర్ జిందాల్ స్కాలర్‌షిప్‌లు అందాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మెరిట్ బేసిస్‌తో విద్యార్థులకు రూ.9000 నుంచి రూ.16,200 స్కాలర్‌షిప్‌లు అందజేసినట్లు చెప్పారు. స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులను కరెస్పాండెట్ డాక్టర్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సమీనా అభినందనలు తెలియాజేశారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది

రూ.40 కోట్లతో గ్రామాలకు రోడ్లు : ఎమ్మెల్యే



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల వ్యాప్తంగా సుమారు రూ.40 కోట్లతో గ్రామీణ పల్లెలకు రోడ్లను వేస్తున్నట్లు మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం నిమ్మనపల్లి మండలంలో ఆయన పర్యటించారు. ఆయనకు సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు సదాశివరెడ్డి, సీనియర్ నాయకులు ఆర్ఐ రమణారెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు ఘన స్వాగతం పలికారు. నిమ్మనపల్లి పంచాయతీలోని కొత్తపల్లి, బోడుమల్లయ్యగారిపల్లి, తురకపల్లెలకు అనుసంధానిస్తూ అగ్రహారం రోడ్డు నుంచి 1.8 కిలోమీటర్ల వరకు రూ.1.20 కోట్లను వెచ్చించి వేస్తున్న రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివన్నారు. ఓవైపు ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తూ, మరోవైపు అభివృద్ధి పనులను జోరుగా కొనసాగిస్తుందని పేర్కొన్నారు. మండలంలో ఇప్పటికే మొదట విడతలో 10 పనులకు గాను రూ.13.70 కోట్లను వెచ్చించి 23 కిలోమీటర్ల మేర రోడ్లను వేశామని తెలిపారు. మూడవ విడతలో అదనంగా 22 పనులకు గాను రూ.27.14 కోట్లను వెచ్చించి 37 కిలోమీటర్ల మేర రోడ్లను వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు డిసెంబర్ నెల నాటికి పూర్తవుతాయన్నారు. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి నిధులను మంజూరు చేసి సహాయ సహకారాలు అందిస్తున్న రాష్ట్ర అటవీ శాఖ, భూగర్భగనుల మైనింగ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి సహాయ సహకారాలతో నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పనులను గుర్తించి వారిని ఆదరించాలని కోరారు. అనంతరం సైదాపేటలో మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ నూతన గృహప్రవేశ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే హాజరై వారిని ఆశీర్వదించి, వారి విందును స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేషగిరిరావు, ఎంఇఒ పద్మావతి, ఎపిఎం రజనీకుమారి, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

- సంతకాల సేకరణలో అఖిలపక్ష పార్టీల నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దేశవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం, కెవిపిఎస్, వ్య.కా.స, మాల మహానాడు ఐక్యవేదిక ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై డిసెంబర్ 4వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు నివేదిక సమర్పిం చేందుకుపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టం ప్రకారం బడ్జెట్లో పక్కదారి మళ్లించిన నిధులను తిరిగి కేటా యించాలని, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే 41 సిఆర్‌పిసి ప్రకారం బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, స్త్రీలపై అత్యాచారాలు కేసులు విచారిం చడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని, కోనేరు రంగారావు సిఫార్సులు అమలు చేయాలని, భూస్వాముల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని, అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షలు కోట్లు కేటాయించాలని, జస్టిస్ పున్నయ్య సిఫార్సులు అమలు చేయాలని, కుల వివక్ష, అంటరానితనంపై ప్రభుత్వమే ప్రచార క్యాంపెయిన్ నిర్వహించి టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. శ్మశానాలు లేని దళిత గ్రామాలకు స్థలం కేటాయించాలని, డప్పు కళాకారులు, చర్మకా రులకు రూ.5 వేలు పెన్షన్ పెంచి 45 సంవత్సరాలకే పెన్షన్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. అర్హులైన దళిత కుటుంబానికి రెండు సెంట్లు ఇళ్ల స్థలంతో పాటు రెండు ఎకరాల సాగు భూమిని కేటాయించి పక్కా గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు పెంచాలని తెలిపారు. శ్మశానాలలో పనులు చేస్తున్న కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బిజెపి మతోన్మాద శక్తులు, మనువాద కుట్రలను తిప్పికొట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయరామయ్య, పందికాళ్ళ మణి, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచల య్య, ఇండియన్ లేబర్ పార్టీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సంతకాలు సేకరణ చేపడుతున్న ప్రజాసంఘాల నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

- బిఎఎస్ వ్యవస్థాపకులు శివప్రసాద్

ప్రజాశక్తి-రాయచోటి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ, సిద్ధాంతాలకు అనుగుణంగా ఉద్యమిస్తామని, ప్రజా సమస్యలకు అందరం కలిసి కృషి చేద్దామని భారతీయ అంబేద్కర్ సేన (బిఎఎస్) వ్యవస్థాపకులు ఎం. శివప్రసాద్ పేర్కొన్నారు గురువారం. గాలివీడు రోడ్డులోని ప్రీతం రెసిడెన్సీలో రాష్ట్ర నాయకులు అల్లం తాతయ్య ఆధ్వర్యంలో జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ ఒకే ఆశయంతో, ఒకే మనస్తత్వం కలిగిన పలువురు కలసి ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజా సమస్య పరిస్కారానికి కదం తొక్కాలి అన్నారు. బిఎఎస్ అనేది ఒక కులానికో, మతానికో పరిమితం కాదని అన్ని వర్గాల వారిని కలుపుకొని ముందుకెళ్తామని చెప్పారు. బహుజనుల సంక్షేమంతో పాటు ప్రతి ఒక్కరి సాంఘిక, ఆర్థిక సమానత్వంకై అనునిత్యం పోరాడుతాం అన్నారు. గొప్ప ఆశయాలతో సమస్యల పరిష్కారానికై గ్రామ, మండల, నియోజకవర్గాల వారిగా అందరినీ ఉత్తేజ పరుస్తూ ముందడుగు వేసిన తాతయ్య ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సి.చంద్రయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ ముత్యాల మోహన్, జిల్లా కన్వీనర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు గేట్ సమీపంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కరిమిరెడ్డి భారతి అనే మహిళ గురువారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గేటు సమీపంలో 900-బిలో తమకు 2012లో ప్రభుత్వం ఇంటి స్థలాన్ని మంజూరు చేసిందని తెలిపారు. అందులో ఇల్లు నిర్మించుకున్నామని, అందులో కొంత బాత్‌రూమ్ కోసం ఖాళీ స్థలం ఉందని, రమణమ్మ అనే మహిళ ఎలాంటి ఆధారం లేకుండా తమ ఇంటికి ఎదురుగా ఉన్న స్థలంలో అక్రమంగా గోడ నిర్మిస్తోందన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ను వేడుకున్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన మైనార్టీ నాయకుడు

ప్రజాశక్తి-రామాపురం

మంగళగిరి ఎన్టీఆర్ భవనంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడును, శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు మండల మైనార్టీ నాయకుడు ఎస్.మహబూబ్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయిన తర్వాత రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందని అడగగా రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అరాచకాలు తీవ్రంగా ఉన్నాయని వివరించినట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గం లోని ప్రతి మండలం లోనూ, ప్రతి పల్లెలోనూ చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఆయన వెంట మండల మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలను పరామర్శించిన ఆర్ఆర్

ప్రజాశక్తి-రామపురం

మండలంలోని రాచపల్లి పంచాయతీ వడ్డేపల్లి ఎగువ ఉప్పరపల్లిలో అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తిరుపతి వెంకట సుబ్బన్న, టేకురి రత్తయ్యను గురువారం రాయచోటి నియోజకవర్గం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు తాము అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మదన మోహన్, రామ్మోహన్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎఫ్ఆర్ఒ

వన్యప్రాణులను సంరక్షించాలి : ఎఫ్‌ఆర్‌ఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అడవులను కాపాడుకుంటూ, వన్యప్రాణులను సంరక్షించుకుందామని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్(ఎఫ్‌ఎస్‌ఒ) సుధాకర్ అన్నారు. గురువారం ముష్టూరు గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో సర్పంచ చంద్రాయుడు, కెజిబివి ప్రిన్సిపల్ జరీనా బేగం, అటవీ శాఖ సిబ్బందితో కలిసి వన్యప్రాణుల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ మనుగడతో పాటు అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ కూడా ముఖ్యమని పేర్కొన్నారు. వన్యప్రాణులను సంరక్షించుకోవడం మనందరి బాధ్యతన్నారు. అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అడవులను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందామని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణానికి దోహదపడాలన్నారు. అడవుల్లోని వన్యప్రాణులను సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌బిఒలు శోభా రాణి, వరదారెడ్డి, సుబ్బలక్ష్మి, ఎబిఒలు హరిశంకర్ రెడ్డి, జ్యోతి, శేఖర్, కెజిబివి ప్రిన్సిపల్ జరీనా బేగం, ఎస్ఎంసి చైర్మన్ కొండగార్ల రమణ, వైసిపి నాయకులు చంద్రమోహన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్ కొత్తపేట పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న అవ్వారు బాల శేఖర్, శ్రీ ప్రత్యూష హైస్కూల్, శ్రీ శాంతినికేతన్ హై స్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న రవీంద్రబాబు, రవీంద్రరెడ్డిలను గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి చేతుల మీదుగా కడపలో సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ప్రత్యూష హైస్కూల్ కరస్పాండెంట్ భాను ప్రకాష్, ప్రిన్సిపల్ చందన్ బాబు, శ్రీ శాంతినికేతన్ హై స్కూల్ కరస్పాండెంట్ ఓబయ్య అభినందనలు తెలియజేశారు. **వీరబల్లి:** అయ్యప్పరెడ్డి గారి పల్లి జడ్పీ బాలికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు జానం సుజాత జోనల్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాన్ని అందుకున్నారు. 33 ఏళ్లుగా ఆమె విద్యా శాఖలో స్పెషల్ టీచర్‌గా, మండల గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్‌గా, మండల రిసోర్స్ పర్సన్‌గా, జీవ శాస్త్ర ఉపాధ్యాయినిగా చేసిన సేవలను గుర్తించి, విద్యార్థులకు సాంకేతికతను జోడించి బోధించినందుకు, జగనన్న విద్యా కానుకను 100 శాతం వినియోగించినందుకు, ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి కృషి చేసినందుకు గుర్తించి అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కడపలో అవార్డు ప్రదానం చేశారు. **తంబళ్లపల్లి:** మండలంలోని దాద్దం హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సాంబశివ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయనను ఎంఇఒలు త్యాగరాజు నాగ సుబ్బరాయుడు సహచర ఉపాధ్యాయులు అభినందించారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

స్వచ్ఛత హి సేవా ర్యాలీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో స్వచ్ఛతహి సేవా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, డిల్‌పిఒ పార్వతి, ఎంపిడిఒ జాషువా, మండల కన్వీనర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, డైరెక్టర్ మందల నాగేంద్ర, జడ్‌పిటిసి రత్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామ రాజు, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు అన్వర్‌బాషా, సర్పంచులు రామకృష్ణ, హరికృష్ణారెడ్డి, గోపి, సుబ్రహ్మణ్యం రాజు, శ్రీరామ్ వినోద్, ఎంపిటిసిలు, జనార్దన్ రాజు, మల్లికార్జున, నందా బాల, రాజారెడ్డి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, డిపిఒ ధనలక్ష్మి పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుండి మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట రమణారెడ్డి, ఎంఇఒ చక్రేనాయక్, ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి, ఇఒపిఆర్‌డి పట్నాయక్, ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపిటిసి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీనివాసరాజును కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజును గురువారం టిడిపి ప్రధాన కార్యదర్శి మండెం అబూబకర్, పతకమూరి మల్లికార్జున నాయుడు, బలగాల సురేష్ నాయుడు మర్యాదపూర్వకంగా నియోజకవర్గ రాజకీయ స్థితిగతులపై చర్చించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సింగంశెట్టి నరేంద్ర, నాసర్ ఖాన్, పివిఆర్ కుమార్ పాల్గొన్నారు.



శ్రీనివాసరాజుతో టిడిపి నాయకులు

ఆర్‌బికెల్లో యూరియా కొరత

- అధిక సొమ్ము దండుకుంటున్న ప్రయివేట్ వ్యాపారులు
- ఆందోళన చెందుతున్న రైతులు

యురియా అందక రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతు భరోసా కేంద్రాల్లో దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. కొందరు డీలర్లు కృత్రిక కొరత సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా కొంత మంది వ్యాపారులు ధరలు ఇష్టానుసారంగా పెంచేసి అమ్ముతుండటంతో రైతులకు ఆవేదన తప్పడం లేదు.

ప్రజాశక్తి-చిట్వేలి

మండలంలో యూరియా కొరత వేధిస్తోంది. అవసరం మేరకు యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తోటలకు ఎరువు వేసే సమయం దాటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు వ్యాపారులు కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అవసరమైన ఎరువులు కావాల్సిన రైతులు కియోస్క్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందులో వివరాలు నమోదు చేసుకున్నా సకాలంలో ఎరువులు అందుబాటులోకి రాకపోవడంతో ఇటు అధికారులు అటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదును కోల్పోతే పంట చేతికి రాదనే ఉద్దేశంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. రైతులకు రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అదును కోల్పోతే మొదటికే మోసం అవుతుందని భావించి ఖర్చులు భారమైన భరిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.270 విక్రయిస్తున్నారు. మండలంలో సాగు విస్తీర్ణంబట్టి ఎరువులు అందించాల్సి ఉంది. కానీ... అధికారుల లెక్కలకు పంటల విస్తీర్ణానికి అవసరమైన ఎరువులకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఉద్యాన పంటలైన బొప్పాయి, మామిడి, అరటి, తదితర పంటలకు అవసరమైన మేర యూరియాను వినియోగించాల్సి ఉంది. యూరియాకు కొరత ఏర్పడింది. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం రెండు విడతలకు ఎకరాకి 50 కిలోల కాంప్లెక్స్ ఎరువులు, వంద కిలోల యూరియా వేయాలి. రెండో విడతలో యూరియా అవసరాన్ని బట్టి వేస్తారు. కొన్నిచోట్ల ప్రైవేటు పెస్టిసైడ్స్ డీలర్లు కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు.



పది రోజుల నుంచి మూతపడిన ఆర్‌బికె

యూరియా దొరకడం లేదు



ఐదు ఎకరాలు బొప్పాయి, మామిడి, నిమ్మ చెట్లు సాగు చేశాను. పది రోజుల నుం,ఒ యూరియా కోసం దుకాణాల చుట్టూ తిరుగుతున్నా. ఒక మూట కూడా దొరికే అవకాశం కనబడలేదు. ఈ సమయంలో యూరియాతో పాటు మరికొన్ని ఎరువులు వాడితే కానీ పూత దశ బాగుంటుంది. అధికారులు వెంటనే స్పందించి యూరియాను సరఫరా చేయాలి.

- కొల్లా గుండయ్య నాయుడు, రైతు, చిట్వేలి.

ఇంటింటికీ చేరని రేషన్..

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టని అధికారులు



ఎంపిడిఒ కార్యాలయంలో ఉన్న బియ్యం పంపిణీ వాహనం

ప్రజాశక్తి-చిట్వేలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ బియ్యం పంపిణీ మండలంలో రెండు నెలల నుంచి పాత పద్ధతిలోనే చేపట్టారు. మండల పరిధిలో సుమారు చౌక దుకాణం నెంబర్ 1 నుండి 7 వరకు గల సుమారు 13 గ్రామాల ప్రజలు గతంలో ఉన్న రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ గ్రామాల్లో బియ్యం పంపిణీ వాహనాల ద్వారా చేసే వారు. వాహనదారులు ఒక్కొక్కరుగా రాజీనామా చేస్తూ వెళ్తుంటే తిరిగి ఆ వాహనాలకు ఎవరు రాక పోవడంతో వాహనంతో బియ్యం పంపిణీ పాత పద్ధతులకే దారి తీసింది. బియ్యం కోసం చౌక దుకాణాలు దగ్గరికి వెళ్లిన నెట్‌వర్క్ సరిగా రాకపోవడం వలన గంటల కొలది వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే గతంలో నడవలేని వృద్ధులకు ఇంటి దగ్గర బియ్యం పంపిణీ వలన ఎలాంటి ఇబ్బందులు ఉండకపోగా, ఇప్పుడు ఆ వృద్ధుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం అందరికీ అందించేందుకు కొత్త వాహనదారులను నియమించేందుకు వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేస్తాం



మండలంలోని ప్రజలకు ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. బియ్యం పంపిణీ చేసేందుకు ఆసక్తి కలిగిన వారు వస్తే వారికి వాహనం ఇచ్చి ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

- శిరీష, తహశీల్దార్, చిట్వేలి.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం : 'కొరముట్ల'

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రతి పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు కోరారు. గురువారం మండలం పివిజి పల్లి గ్రామ సచివాలయ పరిధిలోని అనంతయ్యగారిపల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సర్వే చేసి వారి ఆరోగ్యాన్ని ప్రాథమికంగా గుర్తించి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య నిపుణలతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నామన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాలలో లక్షలాది కుటుంబాలకు లబ్ధించే చేకూరతుం దన్నారు. నిరంతరం ప్రజలకు మంచి చేయాలనే సదుద్దేశంతో ఆలోచనలను కార్యరూపందార్చడంలో ముఖ్యమంత్రి కీలక పాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, నాయకులు విజయ్ కుమార్‌రెడ్డి, దలవాయిపల్లి మాజీ సర్పంచ్ మల్లికార్జున రెడ్డి, వైఎస్ సర్పంచ్ చొక్కారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి,సూరిబాబు,మాజీ సర్పంచ్ రాంభూపాల్‌రెడ్డి, తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ రఘురాం, ఎస్ఐ రఘురాం, బికె మణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ సామి శేఖర్, డాక్టర్ చంద్రశేఖర్, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ రెండవ సచివాలయం పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారులు, నగర పంచాయతీ కమిషనర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య వివరాల్ని నమోదు చేస్తున్నారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, వైద్యాధికారులు పురుషోత్తం నాయక్, కిరణ్, శంకర్, వైసిపి టౌన్ కన్వీనర్ సి.ఆర్.చిన్నికృష్ణ, సచివాలయ కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు. **కలకడ :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా పెట్టుకుందని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ కొనియాడారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎంఇఒ మునీంద్ర నాయక్, మెడికల్ ఆఫీసర్స్ కిషోర్ కుమార్ రెడ్డి, మల్లికార్జునరావు, జవహర్, మోహన్, వైస్ ఎంపిపి ఈశ్వర్ నాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణారెడ్డి పార్టీ, కన్వీనర్ కమలాకర్ రెడ్డి, సర్పంచ్ మంజుల, వైసిపి నాయకులు మోహన్ రాజా, సురేష్, సెక్రటరీ జయచంద్ర, శివాజీ, బాలకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి ఇ.రెడ్డెమ్మ వెలుగు చంద్ర పేర్కొన్నారు. చీకిలబైలు పంచాయితీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెలుగు చంద్ర, మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులు రెడ్డి, బొమ్మనచెరువు సర్పంచ్ డి.కరుణాకర్‌రెడ్డి, చీకులబైలు సర్పంచ్, ఎంపిటిసి బాబు రెడ్డి, ఎంపిడిఒ భాను ప్రసాద్, అధికారులు డాక్టర్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** ప్రజలకు ఆస్తులు, డబ్బు కంటే ఆరోగ్యమే మిన్న అని ఎంపీడీవో సురేంద్రనాథ్ అన్నారు. కొట్టాల గ్రామ సచివాలయంలో సర్పంచులు చిట్టి రెడ్డి చెన్నకేశవరెడ్డి ఎంపిటిసి రామకృష్ణ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంఇఒ నాగ సుబ్బరాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. **వీరబల్లి :** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తుందని ఎంపిపి రాజేంద్రనాద్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు గ్రామ సర్పంచ్ తరిగొండ విజయలక్ష్మి అధ్యక్షతన ప్రారంభించారు. ఎంపిపి రాజేంద్రరెడ్డి, డిఎంహెచ్ఒ కొండయ్య, ఎంపిడిఒ మల్లేశ్వరి ముందుగా మందుల పంపిణీ కౌంటర్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ వినయ్ బాబు, జడ్‌పిటిసి శివరాం గౌడ్, వైసిపి మండల కన్వీనర్ ఉమామహేశ్వరరాజు. శ్రీరాములురెడ్డి, కొండూరు సుబ్బరామరాజు, పం చాయతీ సెక్రెటరీ మల్లికా, వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు, సచివాలయ సిబ్బ ంది పాల్గొన్నారు. **గాలివీడు :** ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు ఆవుల నాగభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం గోపనపల్లి హెల్త్ క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 324 మంది కంటి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశవరెడ్డి, ఎంపి డిఒ శేఖర్‌నాయక్, వైద్యులు మాధవి లత, శంకర్ నాయక్ ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు, సచివాలయ సెక్రెటరీ, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. **రాయచోటి :** మండలంలోని మాధవరం–1 సచివాలయంలో శుక్రవారం నిర్వహి ంచబోయే ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో– ఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శా రదా, జి.దివ్య రాణి, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావంతి, జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ యం.నాగిరెడ్డి, కంటి వైద్య నిపుణులు పాల్గొంటారని తెలిపారు. శిబిరంలో 7 రకాల ఉచిత పరీక్షలు, ఉచిత మందులు, మాత్రలు పంపిణీ చేస్తారని, కంటి అద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు ముందస్తుగా ఇంటింటా సర్వే చేసి టోకెన్లు ఇచ్చిన ప్రతి ఒక్కరూ ఉచిత శిబిరానికి రావాలని ఆయన కోరారు. కొత్తగా కూడా వైద్య పరీక్షలు చేయించుకోవలసిన వారు కూడా రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాన్ని రాయచోటి మండల అభివృద్ధి అధికారి మాల్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తెలిపారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

సిహెచ్‌సిలో గుండెపోటు బాధితులకు వైద్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక సిహెచ్‌సి ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెపోటు వచ్చిన బాధితులకు అత్యవసర పరీక్షలతో సకాలంలో వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా సెమీ సిస్టం వైద్య సదుపాయం కలిగినట్టు డాక్టర్ వెంకటరామయ్య తెలిపారు. గురువారం ఆస్పత్రిలో సెమీ సిస్టం ఛాంబర్‌లో ప్రారంభించారు. ఇందులో ఇసిజి సౌకర్యం ఉండడంతో గుండెపోటు వచ్చిన బాధితులకు సకాలంలో ఇసిజి పరీక్షల ద్వారా అత్యవసర వైద్య చికిత్సలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. మరింత మెరుగైన చికిత్సలు అవసరమైతే వెంటనే పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సతినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు తేజస్విని, విక్రాంత్‌రెడ్డి ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇసిజి పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరామయ్య



మణి కుటుంబానికి సాయమందిస్తున్న ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు

మానవత్వం చాటుకున్న ఈశ్వరయ్య

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె చెరువు కట్ట దగ్గర ఉన్న ఎస్‌టి కాలనీలో నివాసం ఉంటున్న తుపాకుల మణి ఇటీవల ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురయ్యారు. విషయం తెలిసికుని మానవత్వంతో చలించిపోయిన గౌరీ శంకర్ జనరల్ స్టోర్స్ ప్రొపరేటర్ రొంపిచర్ల ఈశ్వరయ్య గురువారం తన సొంత ఆర్థిక సహాయం కింద రూ.ఐదు వేలు నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కరెంట్ షాక్‌కు గురైన మణిని చూసిన వెంటనే చలించిపోయానన్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి వారి కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. మణికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మణి శరీర భాగం దాదాపుగా చాలా కాలిపోయిందని, కుడి చేయి పూర్తిగా తీసివేశారని తెలిపారు. ఎడమ కాలులో రెండు వేళ్ళు, కుడి కాలులో రెండు వేళ్ల తీసివేశారన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని తెలిపారు.



ప్రత్యేక ప్రతిభావంతులకు బస్సు పాసులు అందజేస్తున్న కమిషనర్

రాయితీ బస్సు పాసులు పంపిణీ

ప్రజాశక్తి - బి.కొత్తకోట

నగర పంచాయతీ ఒకటవ సచివాలయం పరిధిలో ప్రత్యేక ప్రతిభావంతులకు ఆర్‌టిసి సౌజన్యంతో 50 శాతం రాయితీతో బస్సు పాసులు అందజేశామని కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. వారి శ్రేయస్సు కోసం వివిధ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఈ రాయితీ పాసులతో ప్రత్యేక ప్రతిభావంతులకు 50 శాతం కలిసి వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రత్యేక ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వైసిపి టౌన్ కన్వీనర్ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రకు వెళ్లి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన షేక్ రహమతుల్లా (82) రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గుండెపోటుతో మృతి చెందినట్లు కుమారుడు షేక్ సలీంబాషా తెలిపారు. కోడూరు నుంచి పది మంది ముస్లిములు ఉమ్రా యాత్రకు గత నెల 27న వెళ్లారు. మక్కా మసీదుకు వెళ్లి వారం రోజుల తర్వాత మక్కా నుంచి మదీనాకు వచ్చారు. బుధవారం రాత్రి 8.30 గంటలకు షేక్ రహమతుల్లా గుండెపోటుతో మృతి చెందారు. రహమతుల్లా మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.



రహమతుల్లా (ఫైల్ ఫొటో)

కుస్తీ పోటీల్లో 'గురుకుల' విద్యార్థులకు కాంస్య పతకం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు వద్దగల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని హనీ, సాయి ప్రియ జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ చాటి కాంస్య పతకం అందుకున్నారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగమణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ శిరీష జాతీయ స్థాయి పోటీలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హైమావతి, పిఇటి రత్నకుమారి పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్నఉపాధ్యాయులు

క్రైం కార్నర్

మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి- కలకడ

ఉద్యోగం ఇప్పిస్తామంటూ మాయ మాటలు చెప్పి మోసగించిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువతలో నిరుద్యోగం తాండవిస్తున్న తరుణంలో ఉద్యోగం కోసం ఆశ చూపించి డబ్బులు దోచుకుని మోసగించడం నేటి సమాజంలో పరిపాటిగా జరుగుతున్న విషయం. ఈ కోవలోనే స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ మొరం మీద పల్లెకు చెందిన నరసింహులు, దిగువ తాండాకు చెందిన శివకుమార్ నాయక్ వద్ద నుండి తిరుపతి పట్టణానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ఎస్వీ యూనివర్సిటీలో రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం తీసి ఇస్తానని నరసింహులు నుండి రూ.3.55 లక్షలు, శివకుమార్ నాయక్ నుండి రూ.ఐదు లక్షలు తీసుకొని తరువాత వారికి ఎలాంటి ఉద్యోగము గాని ఇవ్వలేదు. తర్వాత వారికి రామాంజనేయులు గురించి ఎలాంటి ఆచూకీ లేనందున మోసపోయామని తెలిసి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. వీరు ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ తిప్పేస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

ప్రజాశక్తి-నందలూరు

మద్యం త్రాగి వాహనం నడిపినందుకు నందలూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.లత నాలుగు రోజుల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పెనగలూరు పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైమ్ నెంబర్130/2023లో ముద్దాయి అయిన నారాయణరావు గిరి అను వ్యక్తికి జైలు శిక్ష, వెయ్యి జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని పేర్కొన్నారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ కుమ్మరపల్లి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ఇక్బాల్, షేక్ సిరాజుద్దీన్ అను ఇద్దరు అన్నదమ్ములు తప్పిపోయినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2013 సంవత్సరంలో షేక్ మహమ్మద్ ఇక్బాల్, 2018 సంవత్సరంలో షేక్ సిరాజుద్దీన్ ఇంటి నుండి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదని, వారి సోదరి షేక్ షకీలా బేగం గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. సదరు కేసులో తప్పిపోయిన ఇద్దరు వ్యక్తుల గురించి ఏమైనా సమాచారం తెలిస్తే పోలీస్ స్టేషన్‌కి తెలపాలన్నారు.